క్లుప్తంగా

కార్యకర్త వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి



వరుడితో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

కురిచేడు: వైఎస్సార్ సీపీ కార్యకర్త కంభంపాటి అనిల్‌కుమార్ వివాహానికి దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం హాజరయ్యారు. వరుడు అనిల్‌కుమార్‌ను ఆశీర్వదించారు. ఆయన వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, నాయకులు షేక్ సైదా, ఊట్ల వెంకటేశ్వర్లు, నారు శ్రీనివాసులరెడ్డి, పి. వెంకటరెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణ, శ్రీను పాల్గొన్నారు.

పచ్చని చెట్లు అందం



మొక్కలు నాటుతున్న సర్పంచ్, ఇన్‌చార్జి

దొనకొండ: పచ్చని చెట్లు ప్రకృతికి అందమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పచ్చదనం పొందాలని సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె పంచాయతీ వార్డు మెంబర్లతో చేపట్టారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, బొందల రాజు, కొమ్మతోటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చౌడయ్య

యర్రగొండపాలెం: ఎస్సైగా పి.చౌడయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేస్తానని, ఈ మేరకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో తిరుమలనాథ స్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో శనివారం పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఆలయం ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి:
ఇటీవల కాలంలో రోగుల బంధువులు విధుల్లో ఉన్న డాక్టర్లపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. డాక్టర్లు ప్రాణాలు కాపాడుతారే కానీ తీయరు. కోల్‌కత్తాలో డాక్టర్‌పై హత్యాచార ఘటన చాలా దారుణం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయడంతో పాటు నిందితులకు మరణశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి.

డాక్టర్ కనకదుర్గ, మార్కాపురం



వైద్యశాలల వద్ద పోలీసులు ఉండాలి:
ప్రభుత్వ వైద్యశాలల వద్ద పోలీసు రక్షణ కల్పించాలి. వైద్యులపై ఎవరైనా దాడులు చేస్తే వారిపై నాన్‌బెయిల్ బుల్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలి. దేశం, రాష్ట్రంలో కోల్‌కత్తా వంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హాస్పిటల్స్ అంటేనే వివిధ రకాల రోగులు, వ్యక్తులు వస్తారు. ఎవరు ఎలాంటి వారో అర్థం కావడం లేదు. పోలీసు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.

డాక్టర్ బి.శరత్, ఈఎస్ఐ హాస్పిటల్, మార్కాపురం

పశువులకు అందని టీకాలు

- సీజనల్ వ్యాధులతో పశుపోషకుల ఆందోళన
- ఇద్దరు వైద్యులున్నా అందని వైద్య సేవలు

కురిచేడు:



పెద్దవరంలో వైద్యులు లేకుండా టీకా వేస్తున్న ఆహో

పశువులకు సీజన్‌ల వారీగా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పశుపోషకులకు టీకాలు, మందులు సరఫరా చేస్తోంది. ఉద్యమంలా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతోంది. మండలంలో పశువైద్యాధికారుల నిర్లక్ష్యానికి అవి పశుపోషకుల దరి చేరడం లేదు. పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో వాటి నివారణకు పశువైద్యశాఖ ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసింది. వైరస్‌తో వచ్చే తీవ్ర అంటువ్యాధి గాలికుంటు వ్యాధి. చీలిన గిట్టలున్న పశువుల్లో మాత్రమే ఈ వ్యాధి కనిపిస్తుంది. గాలికుంటు వ్యాధి కలిగించే వైరస్‌లలో ఓఏసి, ఆసియా-1, సాట్-1, సాట్-2, సాట్-3 వంటి రకాలున్నాయి. గాలికుంటు వ్యాధిబారిన పడిన పాడి పశువు, గోవు పాలు తాగితే వాటి దూడలు మృత్యువాత పడతాయి. పశువులకు ఈ వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ఉచితంగా టీకాలు వేస్తోంది.

వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు, గేదెలు, ఎద్దుల శరీర ఉష్ణోగ్రత 104-105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. నీరు, మేత సరిగా తీసుకోలేవు. నీరసించి నడిచేందుకు కూడా ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం యాంటి బయాటిక్స్, పెయిన్ కిల్లర్లు వైద్యుల సలహా మేరకు వాడాల్సి ఉంది. ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువుల పేడ, పొంగు, వీర్యం, పాలు, పుండ్ల ద్వారా విసర్జింపబడి వేరొక పశువుకు నీటి ద్వారా, గాలి ద్వారా, మేత ద్వారా వ్యాపిస్తాయి. మండలంలోని పెద్దవరంలో ఆహోలు ఒక్క రోజు టీకాలు వేసి మమ అనిపించారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఆహోలు మాత్రమే వేసి వారు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వైద్యులు గణాంకాలు చెప్పటం విశేషం. ఆహోలు కూడా క్షేత్రస్థాయిలో పూర్తిగా టీకాలు వేయకుండా ఆన్‌లైన్ చేసి పూర్తి చేసినట్లు ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నారు. వైద్యశాలకు సక్రమంగా రాని వైద్యాధికారులు తమ సిబ్బంది చెప్పింది నమ్మటం తప్ప పరిశీలన చేసిన దాఖలాలు లేవు. మండలంలోని 32 గ్రామాలకు కేవలం ఒక్క గ్రామంలో ఒక్క రోజు టీకాలు వేయడంతో టీకాల కార్యక్రమం నిలిచిపోయింది. వైద్యశాలలోనే సక్రమంగా ఉండని వైద్యులు పశువులకు వ్యాధులు వచ్చిన తర్వాత వైద్యం ఎలా అందించగలరని పశుపోషకులు ప్రశ్నిస్తున్నారు. చిన్న చిన్న వ్యాధులకు వైద్యశాలకు పశువులను తీసుకెళ్తే అక్కడ ఉండే అటెండర్లు, సహాయకులు వైద్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారులు చొరవ చూపి మండలంలోని ప్రతి పశువుకి గాలికుంటు టీకా వేసేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

ఆహోలు టీకాలు వేయవచ్చు:
వైద్యులు లేకుండా కూడా గ్రామ పశువైద్య సహాయకులు టీకాలు వేయవచ్చు. ఒక వేళ పశువులకు ఏమైనా రియాక్షన్ వస్తే వారి వద్ద డెక్సామెంథజోన్ ఇంజెక్షన్ అందుబాటులో ఉంచాం. ఆ ఇంజెక్షన్ చేస్తే తిప్పుకుంటుంది. వారు ఇచ్చే సమాచారమే మేం నిర్ధారించుకుంటాం. మా పర్యవేక్షణ అవసరం లేదు.

సీహెచ్ రమేష్‌బాబు, పశువైద్యాధికారి

సర్పంచ్‌లకు గౌరవం ఇవ్వండి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పార్టీలకతీతంగా ఎన్నుకున్న సర్పంచ్‌లకు అధికారులు గౌరవం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు హాజరయ్యారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలు మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి సమావేశానికి అధికారులంతా హాజరైతేనే వచ్చే ప్రజా ప్రతినిధులు తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

సర్పంచ్‌ల తీర్మానం లేకుండా పనులు ఎలా చేశారు?

పంచాయతీల్లో సర్పంచ్‌ల తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తున్నారని డీఈ విఠల్ రాథోడ్‌ను ప్రశ్నించారు. దీంతో విఠల్ రాథోడ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేశానని సమాధానం ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా పనులు చేయమని చెప్పిన అధికారి ఎవరని ప్రశ్నించారు. దీంతో ఆయన సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉన్నారు. దీంతో ఇకపై అలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని, సర్పంచ్ తీర్మానాలు ఉంటేనే పనులు చేయాలని హితవు పలికారు.

మేట్‌ల ద్వారా పనులు చేయించవచ్చని జీఓ ఉందా?

ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేకుండా మేట్‌లు ద్వారా ఉపాధి పనులు చేయించ వచ్చనే జీఓ ఉందా.. అని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఏపీఓ కళ్యాణిని ప్రశ్నించారు. అలాంటిదేమీ లేదని ఆమె సమాధానం ఇచ్చారు. మరి ఎలా పనులు చేయిస్తున్నారని శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో ఇకపై చేయించనని చెప్పారు. ఎంఈఓ కాకర్ల రఘురామయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో గతంలో కంటే వెయ్యి మంది విద్యార్థులు తగ్గారని చెప్పారు. దీంతో శివప్రసాద్‌రెడ్డి కల్పించుకుని మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులను పెంచే బాధ్యత అధికారులే తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు బట్టు రాము, బత్తుల సుబ్బారెడ్డి, కొరివి కోటయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

230 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారులు

కురిచేడు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 230 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్ తెలిపారు. వారిలో 11 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మరో ఆప్తాల్మిక్ అధికారి గురుస్వామి, భార్గవి, సీహెచ్ఓ నాజిని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల కర్తవ్యం



ఎస్సై శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

కురిచేడు: బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల కర్తవ్యమని, దాన్ని ఎస్సై శ్రీకాంత్ తన వంతు కృషి చేశారని సదా ఫౌండేషన్ డైరెక్టర్ బిషప్ ముక్తిపూడి కిరణ్‌బాబు పేర్కొన్నారు. బదిలీపై జిల్లాలోని నాగులుప్పలపాడుకు ఎస్సై శ్రీకాంత్ వెళ్తున్న సందర్భంగా ఆయనకు శనివారం స్థానిక రోహి బైబిల్ భవనంలో ఘన సన్మానం చేశారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎస్సై శ్రీకాంత్ మండలంలో పనిచేసిన అనతి కాలంలోనే ప్రజలతో కలిసి మెలసి ఉంటూ బాధితులకు సత్వర న్యాయం చేసి అందరి మన్ననలు పొందారన్నారు. శ్రీకాంత్ సౌమ్యుడంటూ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పి.లక్ష్మణరావు పేర్కొన్నారు. నిస్సహాయ స్థితిలో న్యాయం కోరుతూ స్టేషన్‌కు వచ్చిన వారికి న్యాయం చేస్తే ఆ దేవునికి చేసినట్లవుతుందని సీనియర్ దైవజనులు జె.రవికుమార్ అన్నారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. జి.నిమ్మేష్, కె.సాయన్న, కె.ప్రశాంత్‌కుమార్, కె.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు ప్రక్రియ తనిఖీ



పంటలను పరిశీలిస్తున్న ఏఓ



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తిమ్మాపురంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో సాగు చేసిన పత్తి, కంది, మిరప పంటలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. పంట నమోదుకు ముందు గ్రామంలో దండోరా వేయిస్తామని పేర్కొన్నారు. రైతులు తప్పని సరిగా సెప్టెంబర్ 15 లోగా ఖరీఫ్ పంటను నమోదు చేయించు కోవాలని సూచించారు. వీఆర్వో, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: పంటను సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో మద్దలకట్ట, సానికవరం, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు పంట సాగు చేయగానే రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు తమ సాగు చేసిన పంటను చూపించి నమోదు చేయించుకోవాలని, పంటను నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. మండలంలో రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎరువులు కావాల్సిన రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లవచ్చన్నారు. వీఏఏలు శ్రీకాంత్, లాలారవి, శిరీష, రైతులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

యర్రగొండపాలెం: కృష్ణాష్టమి పండగ సందర్భంగా శనివారం స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో ముందస్తు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. ఉట్టిని కొట్టి చిన్ని కృష్ణులు సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ దొంతా నిఖిల కిరణ్, ఏవో రవి కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చెట్ల పెంపకంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లూరు (దర్శి): అడ విజాతి మొక్కలు, ఉద్యాన మొక్కలను సాగు భూములు, పొలాల గట్లపై, నీటి కుంటలు, చెరువుల చుట్టూ నాటి వాటి సంరక్షణ చేపట్టే విధానంపై రైతులకు స్థానిక రైతుసేవా కేంద్రంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్‌తో స్వచ్ఛమైన గాలిని కొనుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. వాతావరణ మార్పులకు, అకాల వర్షాలకు, ప్రతి కూలతలకు అన్నింటికి సరిగ్గా చెట్లు లేకపోవటమే కారణమని తెలిపారు. ఆంధ్రాలో కర్నూలు, ప్రకాశం, పల్నాడు జిల్లాలను పైలెట్‌గా తీసుకుని విరివిగా అవగాహన కల్పిస్తున్నట్లు ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ ప్రతాప్ తెలిపారు. గంధం, టేకు, సరుగుడు, మోలియాదుబియా, యూకలిప్టస్, గుమ్మడి టేకు, క్లాడియా తదితర మొక్కల నర్సరీనాటు సామగ్రి ప్లాంటేషన్ పద్ధతులు, మెళకువలు, తెగుళ్లు, వ్యాధులు, వాటి చికిత్స, పంట కోత, మార్కెటింగ్ చేయడం తదితర అంశాలను రైతులకు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా, నాబార్డు ద్వారా ఎన్నో ప్రభుత్వ రాయితీలు అందుతాయని ఎఫర్డ్ సంస్థ సీఈఓ శ్రీలక్ష్మి సూచించారు. ప్రతిరైతు ముందుకు రావాలని, మొక్కల పెంపకం విస్తృతంగా చేపట్టాలని వీఏఏ రాజశేఖర రెడ్డి కోరారు.

సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

ముండ్లమూరు: మండలంలోని మారెళ్లలో 4 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంటును శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఓర్సీహెచ్ సంస్థ నిర్వహణలో ప్లాంట్ రూపుదిద్దుకుంది. సుమారు 18 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌ను కేవలం 80 రోజుల్లోనే పూర్తి చేశారు. సోలార్‌ప్లాంటు నుంచి విద్యుత్ మారెళ్ల సబ్‌స్టేషనుకు అనుసంధానం చేశారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, దర్శి ఇన్‌చార్జి జి.లక్ష్మి, విద్యుత్ ఎస్ఈ కేవీవీ సత్యనారాయణ, డీఈ ఎస్‌కే కరీం, ఏడీఈ కె.పిచ్చయ్య, ఏఈ వీరబ్రహ్మం, ఐఎల్ఐ ఎస్ సీఈఓ నవీన్, సీఈఓ అశోక్, కంపెనీ ఇంజినీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



పనుల వివరాలు చదివి వినిపిస్తున్న డీఆర్‌పీ

దొనకొండ: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కొద్ది పొరపాట్లతో సజావుగా సాగింది. కార్యక్రమంలో డ్వామా పీడీ బి.అర్జునరావు పాల్గొన్నారు. మండలంలోని 18 పంచాయతీల్లో జరిగిన పనులను డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఏప్రిల్ 1 2023 నుంచి మార్చి 31 2024 వరకు ఉపాధి పనులకు సంబంధించి రూ.6 కోట్లు ఖర్చు అయినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. అందులో భాగంగా చెరువులు, కుంటలు, వాగులు, పూడికతీత, చెక్‌డ్యామ్‌లు, హౌసింగ్ బిల్లులు, పండ్ల మొక్కలు తదితర వాటికి ఖర్చు చేశారు. చేసిన పనులకు తనిఖీ బృందం సరిగా ఫొటోలు, రికార్డులు కొద్ది మేర తప్పులు ఉన్నట్లు పీడీ గుర్తించారు. గ్రామాల్లో వీఎస్ఏలు, డీఆర్‌పీలు జరిగిన పనులను రికార్డు చేసే సమయంలో కొద్ది మేర తప్పులు జరుగుతుంటాయని, గమనించి సజావుగా చేయాలన్నారు. తదుపరి ప్రజా వేదికలో ఇలాంటి తప్పులు లేకుండా రికార్డులు జాగ్రత్తగా ఉంచాలని సిబ్బందికి పీడీ అర్జునరావు సూచించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అధికారి దాసరి సురేష్, విజిలెన్స్ సూపరింటెండెంట్‌లు షేక్ దావూద్, సురేష్, ఎస్ఆర్‌పీ పి.సురేష్, ఏపీఓ టి.దేవయ్య, ఈసీ శివరామ్, రమేష్, డీఆర్‌పీలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు

దర్శి: అక్రమ లేఔట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ హెచ్చరించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు దర్శి నగర పంచాయతీలో వేసిన పలు లేఔట్లను నగర పంచాయతీ అధికారులు అక్రమమైనవిగా గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై ఎలాంటి లావాదేవీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.